సాక్షి
హనుమకొండ
సోమవారం | 8 | జూలై | 2024



నారక్కపేటలో విషాదం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను(31) మృతిచెందాడు.

- 8లో▸



అరుణాచలానికి బస్సు సౌకర్యం

తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలానికి హనుమకొండ నుంచి ఆర్టీసీ బస్సు నడవనున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

'ట్రెంగ' హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గాలు



హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్‌గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో రాష్ట్ర అధక్షుడు కొడమల్ల రవి ఆధ్వర్యంలో జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మరుపల్ల మల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా పొట్లపల్లి రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మేకల రమేశ్, కోశాధికారిగా పాలుసారి దామోదర్, ప్రచార కార్యదర్శిగా గూడెపు వీరస్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా భూక్యా కన్నా నాయక్, ప్రధాన కార్యదర్శిగా నాలిక ఆనంద్, ప్రచార కార్యదర్శిగా పెండ్లి రంజిత్, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మీనారాయణ, ఐలేశ్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు రవి తెలిపారు. రాష్ట్ర కోశాధికారి సలీంపాషా, బాధ్యులు మిట్టపల్లి వెంకటేశ్వర్లు, ఖదీర్‌ఖాన్, నరేందర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఫార్మ్- డి మూడో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మ్-డి మూడో సెమిస్టర్ పరీక్షలు(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈనెల 10 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న పేపర్-1 ఫార్మకాలజీ-2, 12న పేపర్-2 ఫార్మాస్యూటిక్ అనాలసిస్, 15న పేపర్-3 ఫార్మాకాథరాప్యూటిక్స్-2, 19న పేపర్-4 ఫార్మాస్యూటికల్ జూరిస్‌ప్రుడెన్స్, 22న పేపర్-5 మెడిసినల్ కెమిస్ట్రీ, 24న పేపర్-6 ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు.

వసతి.. అధోగతి

శిథిలమైన హాస్టల్ భవనాలు

- అరకొర వసతులు, అధ్వాన పరిస్థితులు
- అందుబాటులో ఉండని వార్డెన్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి..

'శిథిలావస్థలో భవనాలు.. పెచ్చులూడుతున్న పైకప్పులు.. వానొస్తే పడకలన్నీ తడుసుడే.. తలుపులు లేని స్నానపు గదులు, మరుగుదొడ్లు.. పురుగులు పట్టిన బియ్యం.. కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు'.. ఇదీ ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితి. అరకొర వసతులు, అధ్వాన పరిస్థితుల్లో విద్యార్థులు దినదిన గండంగా కాలం గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వారి బాగోగులను, హాస్టళ్లను పర్యవేక్షించాల్సిన వార్డెన్లు అందుబాటులో లేకుండా పోయారు. శనివారం హాస్టళ్లను 'సాక్షి' విజిట్ చేయగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

– హన్మకొండ చౌరస్తా/పరకాల/ఆత్మకూరు/శాయంపేట



పరకాల : తలుపులు ఊడిపోయి ఉన్న బీసీ హాస్టల్ స్నానపు గదులు.. మరుగుదొడ్లు

వార్డెన్ ఆఫీస్‌కు తాళం..



తాళం వేసి ఉన్న ఆఫీస్ రూం

శాయంపేట: మండలంలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం, మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల, కళాశాలలు ఉన్నాయి. వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం వార్డెన్ సుష్మ అందుబాటులో లేరు. ఆఫీస్ రూంకు తాళం వేసి ఉంది.

పురుగులు పట్టిన బియ్యం



పురుగులు పట్టిన బియ్యాన్ని చెరుగుతున్న వంట మనుషులు

కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాల, కళాశాలలో పురుగులు పట్టిన బియ్యాన్ని వంట మనుషులచే చెరిగించి విద్యార్థులకు వండి పెడుతున్నారు. అంతే కాకుండా నిల్వ ఉంచిన దోసకాయలు చాలా వరకు కుళ్లిపోయి ఉన్నాయి. మొత్తం 320 మంది విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయులకు 20 వాష్ రూంలు మాత్రమే ఉన్నాయి.

హెడ్ ఆఫీస్ నుంచి అనుమతి తీసుకోవాలి..

ఇదిలా ఉండగా.. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరిశీలనకు వెళ్లిన 'సాక్షి' ప్రతినిధి ప్రిన్సిపాల్ సుభాషిణికి ఫోన్ చేసి మాట్లాడితే మాకు హెడ్ ఆఫీస్ నుంచి విలేకర్లకు అనుమతి లేదు.. మీరు ఏదైనా ఉంటే హెడ్ ఆఫీస్‌లో అనుమతులు తీసుకొని వస్తేనే రానిస్తామని చెప్పి గేట్‌లోకి అనుమతి నిరాకరించారు.

కాలకృత్యాలకూ ఇబ్బందే..

పరకాల: పట్టణంలోని బీసీ హాస్టల్ స్నానాల గదులు, మరుగుదొడ్ల తలుపులు చెదలుపట్టి పనికి రాకుండా పడిపోయాయి. దీంతో విద్యార్థులు స్నానాలు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెటీరీయల్ రావడం లేదు.. అందుకే బిగించడంలో కాలయాపన జరుగుతోంది.. అధికారుల దృష్టికి తీసుకెళ్లి కొద్ది రోజుల్లోనే బిగించే చర్యలు తీసుకుంటామని' హాస్టల్ వార్డెన్ కట్టయ్య చెబుతున్నారు.

దోర్లులేని వాష్ రూంలు..



విరిగిపోయిన వాషరూం దోర్లు

శాయంపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు 628 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ రెగ్యులర్, నాన్‌టీచింగ్ ఉపాధ్యాయులు నలుగురు, గెస్ట్ ఉపాధ్యాయులు 29 మంది ఉండగా సరిపడా వాష్ రూంలు లేవు. ఉన్నవాటిలో చాలా వరకు డోర్లు విరిగి, ఊడిపోయి ఉన్నాయి.


ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు నిల్..



మూసి ఉన్న ఎస్సీ హాస్టల్

ఆత్మకూరు: మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉన్నాయి. ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు ఎవరూ చేరకపోవడంతో ఇంకా తెరుచుకోలేదు. బీసీ హాస్టల్‌లో 100 మందికి గాను 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్‌లో మరమ్మతు, విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. బాత్రూమ్‌లు, మరుగుదొడ్లకు తలుపులు, కిటికీలు అమర్చుతున్నారు.

గదుల్లోకి వర్షపు నీరు..



పెచ్చులూడిన హాస్టల్ భవనం పైకప్పు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీ కాలనీలోని ఎస్సీ బాలుర వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. కప్పునుంచి పెచ్చులూడుతున్నాయి. విద్యార్థులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. 3 నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు 30మంది ఉంటున్నట్లు హెచ్‌డబ్ల్యూఓ రేచల్ తెలిపారు. వానాకాలం వచ్చిందంటే సీలింగ్ నుంచి నీరు కురిసి గదుల్లోకి చేరుతోంది. వసతిగృహం ఆవరణలో నిరుపయోగంగా మారిన శిథిలమైన పాత భవనం ఉంది. విషపురుగులు లోనికి వస్తున్నాయి.

భయంగా గడపాల్సి వస్తోంది..



మాది ములుగు జిల్లా మంగపేట. మూడేళ్లుగా ఈ హాస్టల్‌లో ఉంటున్నాను. ప్రతి సంవత్సరం వర్షాకాలం భయంగా కాలం గడపాల్సి వస్తోంది. భవనం ఎప్పుడు కూలుతుందోననే భయంతో నిద్ర పట్టదు. కొత్త బిల్డింగ్‌లోకి మారుతామని ప్రతీ సంవత్సరం ఎదురుచూస్తూనే ఉన్నాం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనం కేటాయించాలి.

– జి.జగన్, పదో తరగతి

వానొస్తే అంతా బురదే..



వానొస్తే హాస్టల్ గేటు నుంచి లోపలి వరకు నీరు నిలిచి బురదగా మారుతుంది. అందులో నుంచే వెళ్లాలి. రాత్రి పూట పాత భవనం నుంచి విషపురుగులు వస్తున్నాయి. వీటికి తోడు భవనం పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. వాన నీళ్ల బెడ్‌పై కురుస్తున్నాయి. అసలు నిద్ర పట్టడం లేదు.

– అంజి, పదో తరగతి

కపాలిని, భగమాలినీ క్రమంలో అమ్మవారి అలంకరణ





అమ్మవారి అలంకరణలు

హన్మకొండ కల్చరల్: శ్రీభద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం అమ్మవారిని కపాలిని, భగమాలినీ క్రమంలో అలంకరించారు. అంతకుముందు ఉదయం అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేదపండితులు సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, దీక్షాహోమం, చతుస్థానార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలమూర్తిని పూలమాలలతో అలంకరించారు. ఎంజీఎం ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రధరక్ అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



హన్మకొండ కల్చరల్: వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదివారం రాత్రి భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు ఆమెకు శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

కాశోజీ సెంటర్: వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని ఆమె పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొనాలని సూచించారు.



క్లుప్తంగా

గురుకుల డిగ్రీ కళాశాలల్లో నేరుగా అడ్మిషన్లు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని వరంగల్ ఆర్‌సీఓ వై.మనోహర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ములుగు, మహబూబాబాద్, స్టేషన్‌ఘనపూర్ (పెంబర్తి)లో బీసీ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలు, పాలకుర్తి, జయశంకర్ భూపాలపల్లిలోని బాలుర గురుకుల డిగ్రీ కళాశాలల్లో నేరుగా ప్రవేశాలు పొందొచ్చని తెలిపారు. బీఎస్సీ (బీజెడ్‌సీ), ఎంపీసీ(సీఎస్), బీకాం (సీఏ), బీఏ, బీకాం (జనరల్), బీకాం (బిజినెస్ అనలిటిక్స్), ఎంఎస్‌సీఎస్ కోర్సుల్లో విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా బీసీ గురుకుల కళాశాలల్లో ఖాళీ సీట్లకు ప్రిన్సిపాల్స్, స్పెషల్ ఆఫీసర్లను సంప్రదించి అడ్మిషన్లు పొందాలని మనోహర్‌రెడ్డి కోరారు. పూర్తి వివరాలకు ములుగు (9989 991703), పెంబర్తి (98666 10429), మహబూబాబాద్ (70930 03078), పాలకుర్తి (99894 18015), జయశంకర్ భూపాలపల్లి (91541 02635) సంప్రదించాలని తెలిపారు. ఆయా కోర్సుల్లోని ఖాళీ సీట్లలో అర్హతలను బట్టి అడ్మిషన్లు పొందొచ్చని, వివిధ కోర్సుల్లో సీట్లు ఎక్కువగానే ఖాళీలు ఉన్నాయని మనోహర్‌రెడ్డి తెలిపారు.

రైల్వే క్వార్టర్స్‌లో దొంగ హల్‌చల్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలో ఆదివారం ఓ దొంగ హల్‌చల్ చేశాడు. స్థానికుల కథనం ప్రకారం.. చింతల్ బస్తీలోని రైల్వే ఈఎల్‌ఎస్ క్వార్టర్స్‌లో ఆదివారం ఓ మహిళ పనులు చేసుకుంటుండగా దొంగ క్వార్టర్స్ వెనుకాల నుంచి ఇంట్లోకి చొరబడేందుకు యత్నించాడు. గమనించిన సదరు మహిళ వెంటనే ఇంటి డోర్ లాక్‌చేసి లోపలే ఉండిపోయింది. అయితే దొంగ తెలివిగా వ్యవహరించి వెళ్లినట్లు నటించి డోర్ వద్దే నిల్చున్నాడు. ఈ క్రమంలో దొంగ వెళ్లిపోయడా లేదా అని డోర్ తీసే సరికి పక్కనే ఉన్నాడు. మళ్లీ ఇంట్లోకి రావడానికి ప్రయత్నించగా ఓ వ్యక్తి గమనించి దొంగా..దొంగా అని అరవగా అక్కడి నుంచి పారిపోయాడు. రైల్వే క్వార్టర్స్‌లో చోరీ చేసేందుకు వచ్చిన విషయాన్ని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి విషయం తెలుసుకున్నారు. రైల్వే క్వార్టర్స్‌లో రైల్వే, సివిల్ పోలీసులు పెట్రోలింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాము కాటుతో చిన్నారి మృతి

వెంకటాపురం(కె) : పాముకాటుతో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని శాంతినగర్‌లో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాటి కావ్యశ్రీ (12) చిరుతపల్లి ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో నేలపై నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. దీంతో చిన్నారి కేకలు వేయడంతో తల్లిదండ్రులు మనోజ్, కౌశల్య నిద్ర నుంచి లేచి పామును గమనించి చంపారు. అనంతరం చిన్నారిని వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు
బ్రాయిలర్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

నారక్కపేటలో విషాదం

- చికిత్స పొందుతూ ఎస్సై శ్రీను కన్నుమూత
- న్యాయం చేయాలని కుటుంబీకులు, గ్రామస్తుల ధర్నా
- భారీగా మోహరించిన పోలీసులు



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, బంధువులు



ఎస్సై శ్రీరాముల శ్రీను (ఫైల్)

నల్లబెల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను(31) కన్నుమూశారు. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో ఆయన స్వగ్రామం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలో విషాదం నెలకొంది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. అశ్వరావుపేట ఎస్సై శ్రీనుపై కొంతకాలంగా సీఐ జితేందర్ రెడ్డితో పాటు సిబ్బంది మానసిక వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. పైగా సీఐ జితేందర్ రెడ్డితో పాటు సిబ్బంది వేధింపులు మరింత పెరిగాయి. దీంతో మనస్తాపానికి గురైన శ్రీను గత నెల 30న మహబుబాబాద్ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసిన వైద్యులు.. శ్రీను మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించగా తమ స్వగ్రామం నారక్కపేటకు తరలించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు ఆందోళన చేశారు. న్యాయం చేస్తామని పోలీసు అధికారుల హామీ మేరకు ఆందోళన విరమించారు. అనంతరం కుటుంబ సభ్యులు శ్రీను అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఐదు నెలల క్రితం అశ్వరావుపేటకు బదిలీ ..

2014 బ్యాచ్‌కు చెందిన ఎస్సై శ్రీను.. భద్రాది కొత్తగూడెంలో జిల్లా కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ట్రెనింగ్ పూర్తి చేసుకుని అన్నపురెడ్డిపల్లి, కొత్తగూడెం త్రీ టౌన్, బోడు, చుంచుపల్లి, డీసీఆర్బీ భద్రాది కొత్తగూడెం, మణుగూరు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఐదు నెలల క్రితం అశ్వరావుపేటకు బదిలీ అయ్యాడు. అయితే ఇక్కడి పోలీసుస్టేషన్‌లో అధికారుల వేధింపులకు బలయ్యాడని కుటుంబ సభ్యులు రోదించారు. కాగా, శ్రీను మృతి వార్త వినగానే అతడి మేనత్త రాజమ్మ గుండెపోటుతో మృతి చెందింది.

పలువురి సంతాపం

శ్రీను మృతి పట్ల భద్రాది కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు, డీసీపీ రవీందర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, భద్రాది కొత్తగూడెం డీఎస్పీ ఎస్‌కే అబ్దుల్ రెహమాన్‌తో పాటు ఇతర అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మండల అధ్యక్షులు బానోత్ సారంగపాణి, చిట్యాల తిరుపతి రెడ్డి పరామర్శించారు.

భారీగా మోహరించిన పోలీసులు..

ఎస్సై శ్రీను ఆత్మహత్య బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ కుటుంబీకులు, గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు నారక్కపేటలో ఆందోళన చేయడంతో పోలీసులు భారీగా మోహరించారు. నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ రాజగోపాల్ పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, నెక్కొండ పోలీస్ స్టేషన్ల నుంచి సిబ్బంది భారీగా చేరుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే బందోబస్తులో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

క్రీడా జీవితం సంతృప్తినిచ్చింది

- 'శాట్' రిటైర్డ్ డీడీ సోటాల ధనలక్ష్మి



ధనలక్ష్మి, రాజమౌళి దంపతులను సన్మానిస్తున్న కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: జిమ్నాస్టిక్స్ క్రీడాకారిణిగా, జిమ్నాస్టిక్స్ కోచ్‌గా, జిల్లా క్రీడల శాఖ అధికారిగా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్‌గా పదవులు ఏమైనా క్రీడా జీవితం ఎంతో సంతృప్తినిచ్చిందని 'శాట్' రిటైర్డ్ డీడీ సోటాల ధనలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని కల్యాణి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ధనలక్ష్మి పదవీ విరమణ సన్మాన సభ జరిగింది. బంధువులు, క్రీడా కోచ్‌లు, శాట్ అధికారుల సమక్షంలో జరిగిన ఈ సభలో ధనలక్ష్మి, రాజమౌళి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఆణిముత్యాలను వెలికితీసి మెరుగైన శిక్షణ అందించడంలో వెలకట్టలేని సంతోషం లభిస్తుందన్నారు. అలాంటి ఆణిముత్యాలు తన జీవితంలో చాలా మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, ఏబీసీ సభ్యుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, రిటైర్డ్ డీఎస్‌డీఓ శివకుమార్, సీనియర్ జిమ్నాస్టిక్స్ కోచ్ ఇందిర, డీఎస్‌ఏ కోచ్‌లు విష్ణువర్ధన్, నవీన్‌కుమార్, కూరపాటి రమేష్, జీవన్, ప్రశాంత్, శంకర్, మాజీ కార్పొరేటర్ స్వామిచరణ్, అంతర్జాతీ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు పోరాడుదాం

- కేయూ బయోటెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్



ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్

కేయూ క్యాంపస్: ఎస్సీ వర్గీకరణ సాధనకు దృఢ సంకల్పంతో పోరాడుదామని కాకతీయ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద వేడుకలు నిర్వహించారు. అలాగే, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ జన్మదిన వేడుకలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్.. ఎంఆర్‌పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ ఉద్యమం ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటూ మందకృష్ణమాదిగ నాయకత్వంలో ముందుకెళ్తోందన్నారు. వర్గీకరణ కోసమే కాకుండా మానవతాదృక్పథంతో దివ్యాంగ, వృద్ధులు, వితంతు, తదతర సామాజిక సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్, ఎంఆర్‌పీఎస్ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డుదయాకర్ మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి మాదిగ, కేయూ ఇన్‌చార్జ్ వడ్డెపెల్లి మధు, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరిస్తున్న మంత్రి సీతక్క, కడియం కావ్య తదితరులు

హన్మకొండ కల్చరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క జీవనప్రస్థానంపై ప్రముఖ రచయిత అస్నాల శ్రీనివాస్ రాసిన 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి హనుమకొండ జిల్లా పరిషత్ సెమినార్ హాల్‌లో కార్యక్రమంలో మంత్రి ధనసరి సీతక్క, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొని 'రణధీర సీతక్క' పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ సీతక్క అంటే తనకు ఎంతో ప్రేమ అన్నారు. కరోనా సమయంలో ప్రజలకు సీతక్క చేసి సేవ దేశవ్యాప్తంగా ఎంతో అభిమానులను సంపాదించుకున్నారన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై నిత్యం పోరాడే వ్యక్తి సీతక్క అని కొనియాడారు. ఈ సందర్భంగా సీతక్కపై ఎంపీ కావ్య రాసిన కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డా. రియాజ్, తేజావత్ బెల్లయ్యానాయక్, తీగల జీవన్‌గౌడ్, సంగోజు రవి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



మృతుడి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హన్మకొండ చౌరస్తా: భార్య పుట్టింటికి వెళ్లి మూడు నెలలైనా రావడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సుబేదారి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ న్యూశాయంపేటకు చెందిన సల్ల లక్ష్మి చిన్న కుమారుడు సారంగం(34)కు కొన్నేళ్ల క్రితం సౌమ్యతో వివాహమైంది. పిల్లలు లేకపోవడం దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మూడు నెలల క్రితం సౌమ్య పుట్టింటికి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన సారంగం ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం



విజయభాను

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలానికి హనుమకొండ నుంచి ఆర్టీసీ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను తెలిపారు. ఈ నెల 21న గురు పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని, 20న ఉదయం 6 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుందన్నారు. విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం బయలుదేరి మధ్యాహ్నం 1 గంటలకు వెల్లూరుకు చేరుకుంటుందని, ఇక్కడ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం బయలుదేరి సాయంత్రం 7 గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందని వివరించారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఈ నెల21న మధ్యాహ్నం బయలుదేరి 22న ఉదయం జోగులాంబకు చేరుకుందని, ఇక్కడ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం బయలుదేరి హనుమకొండకు చేరుకుంటుందని వివరించారు. చార్జీలు పెద్దలకు రూ.4.500, పిల్లలకు రూ.2.500గా నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు టీజీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ టూర్ సమాచారం కోసం 9866373825, 7382855492 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ కోరారు.

ఆషాఢంలో గోరింటాకు..

- అత్తాకోడళ్లకు సరదాల హరివిల్లు



అత్త రంగమ్మకు గోరింటాకు పెడుతున్న కోడలు లక్ష్మి

హన్మకొండ చౌరస్తా: ఆషాఢ మాసం ప్రారంభంకాగానే కొత్తగా పెళ్లైనా ఆడపిల్లలు తల్లిగారింట్లో సందడి చేస్తారు. అంతేకాదు ఓ చోట కలిసి గోరింటాకు పెట్టుకుంటూ సంతోషాలు పంచుకుంటారు. ఈ నేపథ్యంలో హనుమకొండలోని వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అత్త రంగమ్మకు కోడలు లక్ష్మి గోరింటాకు పెడుతూ ఆప్యాయత పంచుకుంటూ కనిపించారు. రంగమ్మకు ముగ్గురు కుమారులు కాగా లక్ష్మి పెద్ద కొడుకు దస్రూ భార్య. కొడుకులు, కోడళ్లు ఎంత పెద్దగైనా తల్లి ముందు పిల్లలే. పక్కన ఉన్న మామ కూడా గోరింటాకు పెట్టుకుని వారి మాటలు వింటూ సంతోషంగా కనిపించాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి & జ్యోతిభాపులె ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా దాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263 అమ్మకానికై. 9032111600. [W-1242422]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కుడా, దరఖాస్తు హన్మకొండ. సెల్: 8096520976. [WA-6506]

CHANGE OF DATE OF BIRTH

■ నేను, రిజ్వానా ఖైజర్ W/o. MD. అహ్మద్ ఖాన్, ఎక్స్-నయాబ్ సుబేదార్ సర్వీస్ ID No: TS/10/6514481, సర్వీస్ ID No: Jc771552K R/o. H.No: 16-7-341, యాకుబ్‌పురా వెనుక A.J. మిల్స్, వరంగల్ సిటీ & జిల్లా 506013 TS. ఆధార్ మరియు SSC సర్టిఫికేట్ ప్రకారం నా సరైన పుట్టిన తేదీ 31.08.1977. నా భర్త అధికారిక పత్రాలలో పొరపాటున 30.08.1978గా నమోదు చేయబడింది. నేను నా అసలు పత్రాల ప్రకారం నా పుట్టిన తేదిని మారుస్తున్నాను. దానిని అంగీకరించండి. [W-1239804]

HOTEL FURNITURE FOR SALE

■ హన్మకొండలోని చింతగట్టు క్యాంపు ముందు ఉన్న G.P. Mess Hotel ఫర్నీచర్ అమ్మబడును. సంప్రదించండి: సెల్: 97058 64281. [M-11860]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం + కమిషన్. ఫోన్: 8295642391, 7015882322. [H-189684]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185238]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

- ఎన్పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ వరంగల్ చైర్మన్ ఎన్.వి.వేణుగోపాలచారి

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ సీజీఆర్‌ఎఫ్ వరంగల్ చైర్మన్ ఎన్.వి.వేణుగోపాలచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న ఖమ్మం జిల్లా రాయుడుపాలెం సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న కోర్టులో రాయుడుపాలెం, సత్తుపల్లి టౌన్, సత్తుపల్లి రూరల్, వేంసూర్ సెక్షన్ కార్యాలయాల పరిధి వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని వివరించారు. 10న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గండుగపల్లి సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో గండుగపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, వినాయకపురం సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు, 12న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో డోర్నకల్, గార్ల, కురవి, కొత్తపేట, సీరోలు సెక్షన్ కార్యాలయాల పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.అలాగే 19వ తేదీన ములుగు జిల్లా తాడ్వాయి సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో లక్ష్మిదేవీ పేట, మల్లంపల్లి, ములుగు, పస్రా, తాడ్వాయి సెక్షన్ కార్యాలయాల పరిధిలోని వినియోగదారులు, 20న పెద్దపల్లి జిల్లా మంథని సబ్ స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో బేగంపేట, ఇక్లాస్‌పూర్, కమాన్‌పూర్, మంథని టౌన్, ముత్తారం సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

సీఐపై హత్యా నేరం కేసు నమోదు చేయాలి

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్




ధర్నా చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

హన్మకొండ: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకుడైన సీఐ జితేందర్ రెడ్డి, బాధ్యులైన కానిస్టేబుళ్లపై హత్యా నేరంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్యకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోని పోలీసు శాఖలో కుల వివక్ష సిగ్గుచేటని విమర్శించారు. ప్రముఖ న్యాయవాది, అస్సైన్ భూమి సమితి(ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ మాట్లాడుతూ కేసును పారదర్శకంగా విచారణ జరిపి బాధ్యులైన ప్రతీ ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, జిల్లా కార్యదర్శి చుంచు నరేశ్, జిల్లా నాయకులు మంద నవీన్, వేల్పుగొండ నర్సింగరావు, మోరే ఐలయ్య, సిలువేరు నరేందర్ పాల్గొన్నారు.

బంగారంతో పారిపోయిన వ్యక్తి అరెస్ట్

- నిందితుడి వద్ద నుంచి రూ. 7.30 లక్షల బంగారం, బైక్ స్వాధీనం



ఇన్‌స్పెక్టర్ శివకుమార్

రామన్నపేట : తన ఆర్థిక బాధలు తట్టుకుకోలేక వినియోగదారుల బంగారంతో పరారైన వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తారక్ నాథ్.. అలోక్ అనే వ్యక్తి ద్వారా 2018లో వరంగల్‌కు చేరుకుని బంగారు ఆభరణాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనంతరం సొంతంగా బంగారం దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు పరిచయమున్న అబ్దుల్ రహమాన్ వద్ద రూ. 10 లక్షల చిట్టీ, వ్యాపారంలో అవసరం నిమిత్తం 12 తులాలు అతడికి బాకీ ఇచ్చాడు. అయితే రహమాన్ పారిపోవడంతో తారక్‌నాథ్ పూర్తి ఆర్థిక ఇబ్బందులోకి వెళ్లిపోయాడు. అంతేకాకుండా తారక్ నాథ్ వద్ద పనిచేసే సఫాన్ అనే గుమస్తా కూడా మూడున్నర తులాల బంగారంతో పరారయ్యాడు. ఈ క్రమంలో వినియోగదారులు ఇచ్చిన బంగారం అవసరాలు తీర్చుకునేవాడు. చాలామంది వినియోగదారులు అందించిన బంగారానికి సమయానికి ఆర్డర్లు ఇవ్వకపోవడం.. కొత్తగా వచ్చిన బంగారంతో పాత వినియోగదారులకు ఆర్డర్లు చేస్తూ వచ్చాడు. ఏదైనా కొత్త ఆర్డర్ వస్తే పరార్ కావాలని ఆలోచిస్తున్నాడు. ఈక్రమంలో సుమారు 20 రోజుల క్రితం సపాన్ అనే వ్యక్తి ఆభరణాలు తయారు చేయాలని చెబుతూ సుమారు 7.5తులాల బిస్కెట్ ఇచ్చాడు. అలాగే, శ్రీనాథ్ అనే వ్యక్తి 6.7 తులాలు, శ్రీనివాస్ అనే వ్యక్తి 2 తులాల బంగారం ఇచ్చారు. ఈ బంగారంతో పారిపోవడానికి ఆలోచన చేస్తున్న క్రమంలో హుజూరాబాద్‌కు చెందిన రాజు అనే వ్యక్తి 8 తులాల బంగారం కోసం గొడవ చేయగా అతడికి ఐదు తులాలు అప్పగించాడు. ఇందులో 3.9 తులాల బంగారాన్ని విక్రయించి తన వద్ద పనిచేసే వర్కర్లకు వేతనాలు ఇచ్చాడు. మిగతా వచ్చిన డబ్బులతో తారక్‌నాథ్ తన భార్యతో కలిసి విమానంలో కోల్‌కతా వెళ్లాడు. అయితే ఫ్లైట్‌లో ఏడు తులాల బంగారం తీసుకెళ్తే పట్టుకుంటారని తన షాపులో పనిచేసే వర్కర్‌ను బస్సులో తీసుకురమ్మని చెప్పాడు. అయితే గుమాస్తా కోల్‌కతాకు రానని చెప్పడంతో షాపులో ఉన్న బంగారం తీసుకెళ్లడానికి శనివారం రాత్రి వరంగల్‌కు రాగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం తారక్ నాథ్ వద్ద నుంచి రూ .7 తులాల బంగారం, రూ. లక్ష విలువైన ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రిజిస్ట్రేషన్ చేస్తేనే ఆందోళన విరమిస్తాం

- నిందితుడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన
- పోలీసుల అదుపులో పంచాయితీ పెద్దలు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివకుమార్

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో సోదరుల మధ్య వివాదం నెలకొని.. అన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోర్జరీ కాగితాలతో భూమి కాజేశారని మృతుడి కుటుంబసభ్యుల ఆరోపిస్తూ.. న్యాయం చేయాలని నిందితుడి ఇంటి ముందు మృతదేహంతో ఆందోళనకు దిగారు. రెండు రోజులుగా ఈ ఆందోళన కొనసాగుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. అన్నాసాగరంకు చెందిన బండా శ్రీనివాస్‌రెడ్డికి మహేందర్‌రెడ్డి (55), ప్రభాకర్‌రెడ్డి ఇద్దరు కుమారులు. తండ్రి వారసత్వంగా వచ్చిన భూమిని ప్రభాకర్‌రెడ్డి తన అన్న మహేందర్‌రెడ్డికి తెలియకుండానే ఫోర్జరీ కాగితాలతో సాదాబైనామా ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఈవిషయమై రెడ్డి సంఘం పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. ఈక్రమంలో సమస్య పరిష్కారానికి పెద్ద మనుషులు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారని మృతుడి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బండా రత్నాకర్‌రెడ్డి, అన్నాసాగరం మాజీ ఉపసర్పంచ్ రామంచ సాయిలుతో పాటు మరో పది మంది పెద్ద మనుషులుగా వ్యవహరించారు.

బలవంతం చేస్తే మూకుమ్మడి ఆత్మహత్యలు..

అయితే మృతదేహాన్ని బలవంతంగా తరలించడానికి ప్రయత్నిస్తే కుటుంబసభ్యులమంతా మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకుంటామని మహేందర్ రెడ్డి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ చేశాకే.. మృతదేహాన్ని తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

సంఘటన స్థలాన్ని సందర్శించిన ఏసీపీ..

కాగా, సంఘటన స్థలాన్ని కాజీపేట ఏసీపీ తిరుమల్ సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ముందుగా ఆందోళన విరమించాలని కోరారు. అందుకు మృతుడి కుటుంబసభ్యులు మాత్రం నిరాకరించారు.

నిందితుల పరారీ.. పోలీసుల అదుపులో పెద్ద మనుషులు

ఈ సంఘటనతో ప్రభాకర్‌రెడ్డి, ఆయన భార్య జ్యోతి పరారీలో ఉండగా.. వారి కుమారుడు సాయినాథ్‌రెడ్డి యూఎస్‌లో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ పంచాయితీకి పెద్దలుగా వ్యవహరించిన బండా రత్నాకర్ రెడ్డి, సాయిలును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గురుకులాల్లో బదిలీల ప్రక్రియ..

- నేడు దరఖాస్తులు చేసుకోవాలి
- 9నుంచి బదిలీలకు కౌన్సెలింగ్
- మార్గదర్శకాలు జారీ

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లోని ప్రిన్సిపాల్స్ గ్రేడ్ -1, ప్రిన్సిపాల్స్ గ్రేడ్- 2, జూనియర్ లెక్చరర్లు, పీజీటీ, టీజీటీ, స్పెషల్ టీచర్లు (ఆర్ట్ క్రాఫ్ట్, మ్యూజిక్, లైబ్రేరియన్) నాన్‌టీచింగ్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ జరగబోతుంది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి శనివారం రాత్రి బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేశారు. కాగా, 2018లో జరిగిన బదిలీల తరువాత ప్రస్తుతం ట్రాన్స్‌ఫర్ల మార్గదర్శకాలు విడుదల కావడంతో అర్హులు దరఖాస్తులు చేసుకోబోతున్నారు.

నేడు ఒక్కరోజే దరఖాస్తులకు అవకాశం

వరంగల్ రీజియన్ పరిధిలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు 19 ఉన్నాయి. మూడు డిగ్రీ గురుకుల కళాశాలలున్నాయి. వరంగల్ రీజియన్ ఆర్‌సీఓ పరిధిలోని ఆయా కళాశాలలోని ప్రిన్సిపాల్స్ గ్రేడ్ -1, ప్రిన్సిపాల్స్‌గ్రేడ్-2 , డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు, టీజీటీ, పీజీటీ, నాన్‌టీచింగ్ ఉద్యోగులు ఈనెల 8న బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాల్సింటుంది. ప్రిన్సిపాల్స్ గురుకుల, కళాశాలల్లోని బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులను ఈనెల 8న సాయంత్రం 5గంటల వరకు వరంగల్ ఆర్‌సీఓ సమర్పించాల్సింటుంది. బదిలీలకు వచ్చిన దరఖాస్తులను హైదరాబాద్‌కు సంబంధిత సొసైటీ కార్యాలయానికి పంపుతారు.

మార్గదర్శకాల్లో ముఖ్యంగా..

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఒకే చోట ఐదేళ్లుగా పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్ తప్పనిసరిగా బదిలీ చేస్తారు. అలాగే జూనియర్ లెక్చరర్లను, పీజీటీలు, టీజీటీలను 8 ఏళ్లు ఒకేచోట పనిచేస్తుంటే వారిని కూడా తప్పనిసరిగా బదిలీ చేస్తారు. వారు కచ్చితంగా బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాల్సింటుంది. ఒకవేళ దరఖాస్తు చేసుకోకపోతే కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగాక లెఫ్ట్‌ఓవర్ వేకెన్సీల్లో అధికారులే వారికి స్థానచలనం కల్పిస్తూ బదిలీ చేస్తారు. రెండేళ్ల సర్వీస్ కలిగిన వారు రిక్వెస్టుగా బదిలీలకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. నాన్‌టీచింగ్‌లోనూ ఎనిమిది ఏళ్లు ఒకేచోట పనిచేస్తున్నవారిని వారిని కూడా తప్పనిసరిగా బదిలీచేస్తారు. రెండేళ్ల సర్వీస్ ఉంటే రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తులు చేసుకోవచ్చు.ఆయా కేడర్ల వారికి జనరల్ సీనియారిటీ జాబితాను కూడా సంబంధిత అధికారులు వెల్లడించారని సమాచారం.

హైదరాబాద్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ

గురుకులాల్లోని ప్రిన్సిపాల్స్ గ్రేడ్ -1, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్స్‌లో దరఖాస్తులు చేసుకున్న వారి బదిలీలకు ఈనెల 9న ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లో అధికారులు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈనెల 10న మల్టీజోనల్‌లో గురుకులాల ప్రిన్సిపాల్స్ గ్రేడ్ -2, జూనియర్ లెక్చరర్లకు, పీజీటీల బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ హైదరాబాద్‌లోనే సేవాలాల్ బంజారా భవన్‌లో నిర్వహిస్తారు. ఈనెల11, 12 తేదీల్లో జోనల్ కేడరైన టీజీటీలు, నాన్‌టీచింగ్‌లోని వివిధ కేటగిరీ ఉద్యోగులకు కూడా హైదరాబాద్‌లోనే బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు.